# కాశీ యాత్ర

ఓటీటీ హిట్

## ఫ్యామిలీ

**డిస్నీ హాట్‌స్టార్:** డిసెంబర్ 18
**తారాగణం:** బాసిల్ జోసెఫ్, జగదీశ్, మంజుల పిళ్లై, అభిరామ్ రామకృష్ణ తదితరులు
**దర్శకత్వం:** నితీశ్ సహదేవ్

అనగనగా ఓ కుటుంబం తరహా కథలు చాలా అందంగా ఉంటాయి. ఆ కుటుంబంలో వింత మనుషులు ఉంటే అవి మరింత బాగుంటాయి. ఆ కథలు కమర్షియల్ ఫార్ములాకు అతీతంగా చిత్రాలు నిర్మించే మలయాళ సినీ ఇండస్ట్రీలో పుడితే ఆలోచింపజేసేలా రూపుదిద్దుకుంటాయి. మదిని హత్తుకునేలా తెరకెక్కుతాయి. నితీశ్ సహదేవ్ దర్శకత్వం వహించిన 'ఫ్యామిలీ' ఇదే తరహా చిత్రం. ఇందులో ఆడంబరాల్లేవు. అతిశయోక్తులు అస్సల్లేవు. కథ నేల విడిచి సాము చేయలేదు. పాత్రలు పరిధి దాటి ప్రవర్తించలేదు. పెద్దగా మిస్టరీలు లేవు. హాస్యం, భావోద్వేగాల కలబోతగా సిద్ధమైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి విజయాన్ని అందుకుంది. ఓటీటీలోనూ రికార్డు స్ట్రీమింగ్ సొంతం చేసుకుంటున్నది. మలయాళంతోపాటు హిందీ, తెలుగు వెర్షన్లూ అందుబాటులో ఉన్నాయి. కథలోకి వెళ్తే.. ఓ కుటుంబంలో అమ్మానాన్న, ఇద్దరు కొడుకులు, ఓ తాతయ్య ఉంటారు. తండ్రికి ఓ ప్రింటింగ్ ప్రెస్ ఉంటుంది. కానీ, దాన్ని పట్టించుకోడు. దమ్మిడీ సంపాదించకుండా ఇంట్లోనే ఉంటుంటాడు. తల్లి మరో ప్రెస్‌లో ఉద్యోగినిగా పనిచేస్తూ ఉంటుంది. పెద్ద కొడుకు అనూప్ (బాసిల్ జోసెఫ్) డబ్బింగ్ ఆర్టిస్టుగా చేస్తుంటాడు. చిన్నోడు యూకే వెళ్లి చదువుకోవాలని అనుకుంటుంటాడు. తాతయ్య మాత్రం తరచూ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైల్వే స్టేషన్‌కు వెళ్లిపోతుంటాడు. చచ్చేలోపు కాశీ వెళ్లాలనేది ఆయన కోరిక. ఇంట్లోవాళ్లు తీసుకెళ్తామని చెప్పినా ఆయన నమ్మడు. ఎందుకంటే.. ఆ ఇంట్లో ఒకరితో ఒకరికి పొత్తు పొసగదు. సంపాదించని తండ్రి అంటే కొడుకులకు చులకన. తనను లక్ష్యపెట్టని కొడుకులంటే తండ్రికి చిన్నచూపు. ఎవరి లోకం వారిదే అన్నట్టుగా ఉంటుంటారు. ఇలా ఉండగా అనూప్‌కు ఓ పెండ్లి సంబంధం కుదురుతుంది. నిశ్చితార్థం రోజు ఆ అమ్మాయిని ఎవరో ప్రేమిస్తున్నారని తెలిసి.. పెండ్లి రద్దు చేసుకుంటాడు. పెండ్లి తప్పిపోయిందన్న బాధ నుంచి బయటపడటానికి వాళ్ల తాతయ్యను కాశీకి తీసుకెళ్లాలని నిర్ణయించుకుంటాడు. చర్చోపచర్చల తర్వాత కుటుంబమంతా వారణాసికి బయల్దేరుతుంది. ఒకరితో ఒకరికి పొసగని ఆ కుటుంబ సభ్యుల కాశీ ప్రయాణం ఎలా సాగింది? అక్కడేం జరిగింది? ఈ యాత్ర వాళ్ల కుటుంబంలో ఎలాంటి మార్పు తెచ్చిందన్నది మిగిలిన కథ! అక్కడక్కడా నిదానంగా సాగినట్టు అనిపించినా.. మొత్తంగా మంచి సినిమా అనిపిస్తుంది.





'పుష్ప 2' పలకరించలేదు. 'దేవర' కరుణించలేదు. 'గుంటూరు కారం' ఘాటెక్కలేదు. 'గేమ్ చేంజర్' వచ్చిందీ లేదు. ఇలా యంగ్ హీరోల సినిమాలు చూడకుండానే 2023 వెళ్లిపోతున్నది. 2022 సంవత్సరంలా బాక్సాఫీస్ రికార్డులు తిరగరాసిన చరిత్రను సొంతం చేసుకోలేకపోయినా... మంచి విజయాలతో బై చెబుతున్నది. చిరంజీవి మాస్ గ్రేస్‌ను, బాలయ్య బాబు వీరంగాన్ని, విభిన్నమైన రజనీకాంత్‌ను చూసిన తృప్తి తనకు చాలంటున్నది. ఫినిషింగ్ టచ్‌గా ప్రభాస్ 'సలార్' ఇచ్చిన కిక్కుతో సెండాఫ్ చెబుతున్న ఈ ఇయర్.. న్యూ ఇయర్‌కు తన జోష్‌ను బహుమతిగా అందిస్తున్నది.

# 2023 హిట్టన్నట్టే!



'డోన్ట్ స్టాప్ డ్యాన్సింగ్.. పూనకాలు లోడింగ్...' అన్నట్టుగానే మొదలైంది 2023. సంక్రాంతి రేసులో బరిలో నిలిచిన 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' రెండు సినిమాలూ నువ్వానేనా అన్నట్టుగా టికెట్లు తెగ్గొట్టాయి. బాబీ దర్శకత్వంలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య'లో కామెడీ టైమింగ్ అదిరిపోవడంతో చిరంజీవి అభిమానులు పండుగ చేసుకున్నారు. మెగాస్టార్‌కు మాస్ మహారాజా రవితేజా జత కలవడంతో సంక్రాంతి పందెం రక్తికట్టింది. 2022లో 'ఆచార్య' వైఫల్యంతో అసహనంతో ఉన్న చిరంజీవికి 'వాల్తేరు..' వీర ఉత్సాహాన్నిచ్చింది. పొంగల్ దంగల్‌లో ప్రతిసారీ హిట్టు కొట్టే నటుడు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వచ్చిన 'వీరసింహారెడ్డి' చిత్రం బాలయ్య మాస్ ఇమేజ్‌తో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల వర్షం కురిపించింది. మొత్తంగా గత సంక్రాంతి బరిలో నిలిచిన ఈ ఇద్దరు సీనియర్ హీరోలు మంచి సక్సెస్‌లు అందుకొని.. 2023కి ఘనమైన ఆరంభాన్నే ఇచ్చారు.





**జనవరి** జోరు ఫిబ్రవరిలో కనిపించలేదు. నెలలు మారుతున్న కొద్దీ ఒకట్రెండు మంచి సినిమాలు మినహా బాక్సాఫీస్ రికార్డులు కొల్లగొట్టే చిత్రాలైతే ఈ ఏడాది పలకరించలేదు. అంచనాలతో వచ్చిన సినిమాలు గల్లంతవ్వగా, చడీచప్పుడు లేకుండా విడుదలైన సినిమాలు మంచి విజయాలు సొంతం చేసుకున్నాయి. సుహాస్ హీరోగా తెరకెక్కిన 'రైటర్ పద్మభూషణ్' ఫిబ్రవరిలో విడుదలై ఫీల్‌గుడ్ మూవీ అన్న పేరును సాధించింది. కామెడీ సినిమాగా అనిపించినా.. క్లైమాక్స్‌లో మదర్ సెంటిమెంట్ బలంగా పండటంతో 'కలర్‌ఫొటో' తర్వాత సుహాస్ ఖాతాలో మరో మంచి సినిమా చేరినట్టయింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ధనుష్ హీరోగా వచ్చిన 'సార్' మంచి సినిమాగా గుర్తింపు పొందింది. ధనుష్ నటించిన తొలి తెలుగు స్ట్రయిట్ చిత్రం ఇదే కావడం విశేషం. ఫిబ్రవరిలో అంచనాల్లేకుండా వచ్చి ఓ మోస్తరు హిట్ టాక్ సొంతం చేసుకున్న చిత్రం 'వినరో భాగ్యము విష్ణుకథ'. వినూత్న చిత్రాల హీరోగా పేరున్న కిరణ్ అబ్బవరం ఖాతాలో మరో మంచి సినిమాగా 'వినరో...' నిలిచింది.

**ఈ ఏడాది** మార్చిలోనే దసరా సందడి చేసింది. అదేలేండి.. నాని, కీర్తి సురేష్ జంటగా వచ్చిన 'దసరా' సినిమా మార్చిలో విడుదలైంది. పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంపై మొదట్లో డిఫరెంట్ టాక్ వచ్చింది. అయితే, టాక్‌లన్నిటినీ పక్కన నెట్టి బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు వసూలు చేసింది. కృష్ణవంశీ దర్శకత్వంలో ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం ప్రధాన పాత్రలుగా వచ్చిన 'రంగమార్తాండ' విమర్శకుల ప్రశంసలు అందుకున్నా.. కాసులు రాబట్టడంలో పెద్దగా సక్సెస్ కాలేకపోయింది. పక్కా తెలంగాణ భాషతో, ఆచార వ్యవహారాలతో వేణు దర్శకత్వంలో వచ్చిన 'బలగం' టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. కథాబలం ఉంటే చిన్నసినిమా అయినా పెద్ద సక్సెస్ అవుతుందని నిరూపించింది. పల్లెల్లో ప్రొజెక్టర్లు కట్టుకొని మరీ 'బలగం' చూశారంటే.. ఈ సినిమా ఎంత విజయం సాధించిందో ఊహించొచ్చు.



**ఏప్రిల్‌లో** మణిరత్నం దర్శకత్వం వహించిన సీక్వెల్ సినిమా 'పీఎస్–2' ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది. 'పొన్నియిన్ సెల్వన్–1'కు కొనసాగింపుగా వచ్చిన ఈ చిత్రం పార్ట్ వన్ అంత గొప్పగా లేదని ప్రేక్షకులు పెదవి విరిచారు. చారిత్రక నవల ఆధారంగా తెరకెక్కిన 'పీఎస్' మొదటి భాగం సైతం తమిళనాడులో హిట్ కొట్టినా ఇక్కడ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా వచ్చిన 'విరూపాక్ష' సాయిధరమ్ తేజ్ కెరీర్‌లో హిట్ సినిమాల్లో ఒకటిగా నిలిచింది. అక్కినేని అఖిల్‌కు 2023లో కూడా నిరాశే ఎదురైంది. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'ఏజెంట్' భారీ పరాజయం పాలైంది.



**మే** నెలలో గుణశేఖర్ కలల ప్రాజెక్టు 'శాకుంతలం' వచ్చింది. పౌరాణిక గాథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దినా ప్రయోజనం లేకపోయింది. సమంత ప్రధాన పాత్రను ఎంతగా పండించినా.. నిదానంగా సాగే కథనం ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. అదే నెలలో రవితేజ హీరోగా వచ్చిన 'రావణాసుర' సైతం భారీ ఓటమిని చవిచూసింది. విభిన్న కథలను ఎంచుకునే శ్రీవిష్ణు నటించిన 'సామజవరగమన', కార్తికేయ హీరోగా వచ్చిన 'బెదురులంక 2012' జూన్‌లో విడుదలై మంచి టాక్ తెచ్చుకున్నాయి. ఆ తర్వాతి నెలలో పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ కాంబోలో వచ్చిన 'బ్రో' కలెక్షన్ల పరంగా ఫర్వాలేదనిపించింది. చిన్న చిత్రంగా విడుదలైన 'బేబీ' హీరో ఆనంద్ దేవరకొండకు మరో విజయాన్ని కట్టబెట్టింది.



**సక్సెస్‌తో** ఈ ఏడాదిని ప్రారంభించిన చిరంజీవికి ఆగస్టులో 'భోళాశంకర్' రూపంలో పరాజయం ఎదురైంది. మెహర్ రమేశ్ దర్శకత్వం వహించిన 'భోళా..' అభిమానులను అలరించలేకపోయింది. రజనీకాంత్ నటించిన 'జైలర్' అదేనెలలో విడుదలై అదరగొట్టింది. సెప్టెంబర్‌లో విజయ్ దేవరకొండ, సమంత జంటగా వచ్చిన 'ఖుషి'ని ప్రేక్షకులు ఆదరించారు. యువతను ఆకట్టుకునే కథాంశం కావడంతో ఓపెనింగ్స్ భారీగా వచ్చాయి. 'లైగర్' పరాజయం తర్వాత 'ఖుషి' విజయ్‌కి మంచి విజయాన్ని అందించింది. సంక్రాంతి రేసులో సత్తా చాటిన బాలకృష్ణ అక్టోబర్‌లో వచ్చిన దసరా రేసులోనూ ముందున్నాడు. తెలంగాణ యాసతో 'భగవంత్ కేసరి'గా ఆయన నటనకు అభిమానులు ఫిదా అయ్యారు. నవంబర్‌లో విడుదలైన 'కీడా కోలా', 'పొలిమేర 2' చిన్న సినిమాలే అయినా కలెక్షను గట్టిగానే రాబట్టాయి.

**చివరిగా** డిసెంబర్‌లో నాని నటించిన 'హాయ్ నాన్న' పెద్దగా ఆకట్టుకోలేపోయింది. ఈ శుక్రవారం బాక్సాఫీస్‌ను పలకరించిన 'సలార్' ఫస్ట్ షో నుంచే హిట్ టాక్ సొంతం చేసుకుంది. ప్రభాస్ కటౌట్‌ను దర్శకుడు ప్రశాంత్‌నీల్ ఓ రేంజ్‌లో వాడుకున్నాడంటూ అందరూ మెచ్చుకుంటున్నారు. డ్రామాకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినా యాక్షన్ సన్నివేశాల్లో ప్రభాస్‌ను ఊహించిన దానికన్నా గొప్పగా చూపాడంటూ ప్రశాంత్‌నీల్‌ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు. మొత్తంగా విజయంతో మొదలైన 2023.. మరో భారీ విజయంతో ముగుస్తుండటం హర్షించదగ్గ విషయం.



## నా లక్ష్యం అదే!

**బీ** టౌన్ మొదటి సినిమాతోనే భావితరం యాక్షన్ హీరోగా పేరు తెచ్చుకున్న నటుడు లక్ష్ లాల్వానీ. టీవీ సీరియల్స్‌తో ఇంటింటికీ పరిచయమైన ఈ అందగాడు.. 'కిల్' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యాడు. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్ని టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించడం విశేషం. 'పోరస్' సీరియల్‌లో పురుషోత్తముడిగా మెప్పించిన లక్ష్ బాలీవుడ్‌లో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడమే తన లక్ష్యం అని చెబుతున్నాడు. 'నాకు నటనపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. ప్రకృతిలో అనుకోకుండా కొన్ని జరిగిపోతుంటాయి కదా, నేను నటుణ్ని కావడం కూడా అలాంటిదే! నాకు పద్దెనిమిదేండ్లు ఉన్నప్పుడు ఢిల్లీ నుంచి ముంబై వెళ్లాను. అక్కడ సీరియల్స్‌లో అవకాశం వచ్చింది. ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ పోయాను. నటుడికి ఇంత ఆదరణ ఉంటుందని అర్థమయ్యాక.. యాక్టింగ్‌ను సీరియస్‌గా తీసుకున్నాను. టెలివిజన్ నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. ఆ అనుభవం 'కిల్' సినిమాకు ఎంతగానో ఉపయోగపడింది. బాలీవుడ్‌లో నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. ఇది విజయవంతంగా కొనసాగుతుందని ఆశిస్తున్నాన'ని చెప్పుకొచ్చాడు లక్ష్.

## షారుక్ హ్యాట్రిక్ ఖుషీ



**బాలీవుడ్‌లో** ఈ ఏడాది భారీగా అచ్చొచ్చిన నటుడు ఎవరని అడిగితే షారుక్ ఖాన్ పేరే వినిపిస్తుంది. కొన్నాళ్లుగా సరైన హిట్ లేక సతమతమవుతున్న కింగ్ ఖాన్ 2023లో హ్యాట్రిక్ విక్టరీ సొంతం చేసుకున్నాడు. 'పఠాన్', 'జవాన్' చిత్రాలు బాక్సాఫీస్ రికార్డులు తిరగరాశాయి. తాజాగా విడుదలైన 'డంకీ' కూడా సూపర్ హిట్ కావడంతో షారుఖ్ అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి 25న విడుదలైన 'పఠాన్' వరల్డ్ వైడ్‌గా సుమారు రూ.1,065 కోట్లు రాబట్టింది. సెప్టెంబర్ 7న విడుదలైన 'జవాన్' సినిమా 'పఠాన్'ను మించి కలెక్షన్లు కొల్లగొట్టింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 1,150 కోట్లు వసూలు చేసింది. ఈ నెల విడుదలైన 'డంకీ' కూడా సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకొని షారుఖ్‌కు హ్యాట్రిక్ విక్టరీని కట్టబెట్టింది. ఈ సినిమా కూడా వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని సినీపండితుల విశ్లేషణ. 'సలార్' సినిమా విడుదలతో 'డంకీ' కలెక్షన్లు కొంత తగ్గినా.. వెయ్యి కోట్లు గ్యారెంటీ అని చెబుతున్నారు.

**ప్రతి క్షణం మరుక్షణంలో కరిగిపోతుంది. కానీ, ఆ క్షణంలో జరిగే కొన్ని సంఘటనలు కొంత కాలం గుర్తుంటాయి. విశేషాలు ఆవిష్కృతమైతే.. చాలాకాలం నిలిచి ఉంటాయి. 2023లో అరడజన్ మందికిపైగా తారలు టాలీవుడ్ కోటలో పాగావేశారు. వీరిలో కొందరు అందచందాలతో ఆకట్టుకుంటే, మరికొందరు అభినయంతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. వచ్చే ఏడాదినీ తమ ఖాతాలో వేసుకునేందుకు సిద్ధం అంటున్న నవతారల సంగతులు ఇవి..**

# ఈ యేటి కొత్త తారలు



నూపుర్ సనన్

సాక్షి వైద్య

రెబ మౌనిక



ఆశికా రంగనాథ్

### అందాల సాక్షి

'ఏజెంట్' సినిమాలో అఖిల్‌తో జట్టుకట్టిన నటి సాక్షి వైద్య. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తాపడ్డా.. సాక్షి సౌందర్యానికి మాత్రం ప్రేక్షకులు ఫిదా అయ్యారు. నటనతోపాటు డ్యాన్సులూ ఇరగదీయడంతో ముంబాయి బొమ్మను వరుస అవకాశాలు పలకరిస్తున్నాయి. వరుణ్‌తేజ్ హీరోగా వచ్చిన 'గాండీవధారి అర్జున' సినిమాలోనూ సాక్షి కథానాయికగా మెప్పించింది. ప్రస్తుతం 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటిస్తున్నది. మరిన్ని స్క్రిప్టులు వింటున్నదట. మొత్తంగా 2024లో సాక్షి మరిన్ని చిత్రాలతో అలరించడం ఖాయంగా కనిపిస్తున్నది.

### నూపుర్.. సూపర్

సామాజిక మాధ్యమాల్లో ఏనాడో సెలెబ్రిటీ హోదా దక్కించుకున్న నూపుర్ సనన్ టాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది. రవితేజ హీరోగా వచ్చిన 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రంలో తన నటనతో మెప్పించింది. బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు దక్కించుకుంటున్నది. ప్రస్తుతం మంచు విష్ణు కథానాయకుడిగా వస్తున్న 'భక్త కన్నప్ప'లో హీరోయిన్ చాన్స్ కొట్టేసింది. మరిన్ని చర్చల దశలో ఉన్నాయట.

### బిజీ అయిపోతుందేమో!

కన్నడ భామలు తెలుగు తెరకు కొత్తేమీ కాదు. ఆశికా రంగనాథ్ కూడా అక్కడి సౌందర్యమే! కళ్యాణ్‌రామ్ హీరోగా నటించిన 'అమిగోస్'లో హీరోయిన్‌గా నటించి తెలుగువారికి పరిచయమైంది. ఆ చిత్రం పెద్దగా సక్సెస్ కాకపోయినా నాగార్జున సినిమాలో చాన్స్ కొట్టేసింది. ఆయన హీరోగా త్వరలో రాబోతున్న 'నా సామిరంగ'లో కథానాయికగా ఆశికా కనిపించనుంది. వచ్చే ఏడాది టాలీవుడ్‌లో ఆశికా బిజీ అవుతుందనడంలో సందేహం లేదంటున్నాయి సినీవర్గాలు.

### మంచి మార్కులు కొట్టేసింది!

మాలీవుడ్, కోలీవుడ్‌లో ఫేమస్ నటిగా గుర్తింపు తెచ్చుకున్న రెబ మౌనిక జాన్ ఈ ఏడాది టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. శ్రీవిష్ణు కథానాయకుడిగా వచ్చిన 'సామజవరగమన' సినిమాలో హీరోయిన్‌గా మంచి నటనను కనబరిచింది. ఫ్యామిలీ లుక్‌తో క్లాస్ మార్కులు కొట్టేసిన మౌనికకు ఆఫర్లు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయట.